
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
గురువారం । 4 । ఏప్రిల్ । 2024



సోమశిలలో 9.46 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో బుధవారం సాయంత్రానికి 9.46 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వివిధ కాలువలకు 1200 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రాములు)	రూ.71,,500
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.6,386
3శాతం జీఎస్టీతో	రూ.6,578
నవర (8గ్రాములు)	రూ.52,624

గరిష్టం/కనిష్టం
38.4 /26.6

వాతావరణం

గాలిలో తేమ 62 శాతంగా బుధవారం నమోదైంది. ఎండ తీవ్రత గురువారం కొంతమేర పెరిగే అవకాశం ఉందని వాతావరణ అధికారులు తెలిపారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
గురువారం	శుక్రవారం
6:27	4:45



పొదలకూరు: ట్రైసైకిల్‌లో సచివాలయం వద్దకెళ్లి పింఛన్ తీసుకుంటున్న వృద్ధురాలు



రామలింగాపురం సమీపంలోని సచివాలయం వద్ద నిరీక్షణ





సంగం: పింఛన్ కోసం వృద్ధుల పాట్లు

అయ్యో.. అవ్వాతాత

వలంటీర్ల సాయంతో ప్రతి నెలా ఒకటో తేదీన ఇంటి వద్దే పింఛన్లు పొందే వృద్ధులపై టీడీపీ కక్షగట్టింది. ఓట్ల రాజకీయంతో చంద్రబాబు దుశ్చర్య పుణ్యమా అని సచివాలయాల వద్ద పండుటాకులు పడిగాపులు కాయాల్సి వచ్చింది. ఓ వైపు ఎండ తీవ్రతను తట్టుకోలేక.. మరోవైపు సచివాలయాల్లో క్యూల్లో గంటల తరబడి నిరీక్షించలేక వృద్ధుల అవస్థ వర్ణనాతీతమైంది. సాధారణంగా మొదటి మూడు రోజుల్లో 90 శాతం మేర నమోదయ్యే పింఛన్ల పంపిణీ.. ఈసారి 52.52 శాతానికే పరిమితమైంది.

– సాక్షి నెట్‌వర్క్

రాబోయేదీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే



మాట్లాడుతున్న విజయసాయిరెడ్డి, పక్కన ప్రసన్నకుమార్‌రెడ్డి



భారీగా తరలివచ్చిన ప్రజానీకం

- భవిష్యత్తులో బీజేపీలో టీడీపీ, జనసేన కలిసిపోతాయి
- ప్రజలకు మరింత సంక్షేమం, అభివృద్ధి
- ప్రజల హృదయాల్లో సీఎం జగన్‌ది చెరగని ముద్ర
- టీడీపీ తీరుతోనే పింఛన్ కష్టాలు

కోవూరు: రానున్న ఎన్నికల్లోనూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయదుందుభి మోగించి మరోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయనుందని పార్టీ నెల్లూరు లోక్‌సభ అభ్యర్థి వేణుంబాక విజయసాయిరెడ్డి పేర్కొన్నారు. విడవలూరు మండలంలోని రామతీర్థంలో పార్టీ కోవూరు అభ్యర్థి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి, ఎమ్మెల్సీ కల్యాణ్ చక్రవర్తితో కలిసి ఎన్నికల ప్రచారాన్ని బుధవారం నిర్వహించారు. తొలుత రామలింగేశ్వరుడ్ని దర్శించుకొని పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన మేమంతా సిద్ధం సభలో విజయసాయిరెడ్డి మాట్లాడారు. పేదల కోసం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి వారి హృదయాల్లో సీఎం జగన్‌మోహన్ రెడ్డి చిరస్థాయిగా నిలిచిపోయారని చెప్పారు. ఎన్నికల అనంతరం టీడీపీ, జనసేన పార్టీలు బీజేపీలో కలిసిపోతాయని పేర్కొన్నారు. త్వరలో తమ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పడనున్న ప్రభుత్వంలో గతం కన్నా మెరుగైన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలు చూడబోతున్నారని తెలిపారు.

ఎన్నికల తర్వాత వారు కానరారు

ఎన్నికల అనంతరం వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంతిరెడ్డి దంపతులు కనిపించరని చెప్పారు. టీడీపీ నెల్లూరు లోక్‌సభ అభ్యర్థిగా పోటీ చేయనున్న వేమిరెడ్డి తన వ్యాపారాల కోసం విదేశాల్లో తిరుగుతుంటారని చెప్పారు. తాను జగన్‌మోహన్‌రెడ్డి తాత రాజారెడ్డి దగ్గరి నుంచి ఇప్పటి వరకు వైఎస్సార్ కుటుంబంతోనే ఉన్నానని తెలిపారు. రాష్ట్ర ప్రయోజనాల కోసమే తాను ఢిల్లీలో ఉన్నానని చెప్పారు. ఏ సమస్య వచ్చినా పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. నిరంతరం అందుబాటులో ఉండే ప్రసన్నకుమార్‌రెడ్డిని భారీ మెజార్టీలో గెలిపించాలని కోరారు.



రామలింగేశ్వరుడి సన్నిధిలో పూజలు

ఆ పాపం టీడీపీదే..

ప్రతి నెలా ఒకటో తేదీనే పింఛన్లను వలంటీర్లు అందజేసేవారని, అయితే మూడో తేదీ నాటికి సైతం వారికి అందకుండా చేసిన పాపం టీడీపీకే దక్కుతుందని విమర్శించారు. ఇంటి వద్దే పింఛన్లు పొందే వృద్ధులు, దివ్యాంగులు నానా అవస్థలు పడి సచివాలయానికి వెళ్లి తీసుకునే స్థితికి తీసుకొచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు.

జగనన్నే మరోసారి సీఎం

టీడీపీ నెల్లూరు లోక్‌సభ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డికి డబ్బుంటే, తనకు ప్రజాశీర్వాదం ఉందని నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి చెప్పారు. వచ్చే ఎన్నికల్లో ఘన విజయం సాధించి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రానుందని తెలిపారు. తనతో పనిచేయించుకొని అమ్ముడుబోయిన వారిని ఎప్పటికీ దగ్గరికి రానివ్వనని స్పష్టం చేశారు. కరోనా సమయంలో భయపడకుండా ప్రజలకు సేవ చేశామని తెలిపారు. సీఎం చలువతో రాజ్యసభ.. టీడీపీ బోర్డు పదవులను వేమిరెడ్డి దంపతులు అనుభవించారని పేర్కొన్నారు. నెల్లూరు సిటీ టికెట్‌ను ముస్లిం మైనార్టీకి కేటాయించారనే కారణంతో పార్టీని వారు వీడారని చెప్పారు. దేశంలో ఏపీని ఆదర్శ రాష్ట్రంగా సీఎం తీర్చిదిద్దారని కొనియాడారు. పార్టీ నియోజకవర్గ యువజన విభాగ అధ్యక్షుడు నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డి డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.

సింహపురికి సీఎం రాక నేడు



మేమంతా సిద్ధం మహాసభ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న విజయసాయిరెడ్డి, కాకాణి గోవర్ధన్‌రెడ్డి, విక్రమ్‌రెడ్డి, ప్రసన్నకుమార్‌రెడ్డి, ప్రతాప్‌కుమార్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు

- కావలిలో మేమంతా సిద్ధం మహాసభ

నెల్లూరు(దర్గామిట్ట): సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన బస్సు యాత్ర సింహపురికి గురువారం రాత్రి చేరుకోనుందని, కావలిలో శనివారం నిర్వహించనున్న మేమంతా సిద్ధం మహాసభకు లక్షకుపైగా ప్రజలు తరలిరానున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు లోక్‌సభ అభ్యర్థి విజయసాయిరెడ్డి పేర్కొన్నారు. మాగుంట లేఅవుట్లోని పార్టీ జిల్లా కార్యాలయంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్యేలతో కలిసి విలేకరుల సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. మేమంతా సిద్ధం మహాసభ పోస్టర్లను ఆవిష్కరించిన అనంతరం విజయసాయిరెడ్డి మాట్లాడారు. స్థానికంగా సమీక్షలను సీఎం శుక్రవారం నిర్వహిస్తారని.. శనివారం ఉదయం 9.30 గంటలకు బస్సు యాత్ర ప్రారంభంకానుందని చెప్పారు. జిల్లాలో ముఖ్యమైన నేతలు తదితరులు సీఎంను కలిసే కార్యక్రమాలు ఉంటాయన్నారు. కావలి సమీపంలోని వెంగయ్యగారిపాళెం వద్ద సభను నాలుగు గంటలకు నిర్వహించనున్నారని వెల్లడించారు. ఆరు గంటలకు సభ ముగిశాక, కందుకూరు వెళ్లనున్నారని పేర్కొన్నారు. సీఎం సందేశాన్ని వినేందుకు ప్రజలు చాలా ఆసక్తిగా ఉన్నారన్నారు. కందుకూరు అనంతరం బస్సు యాత్ర ప్రకాశం జిల్లాలోకి ప్రవేశించనుందని పేర్కొన్నారు. అనంతరం కాకాణి మాట్లాడారు. సిద్ధం సభలకు ప్రజలు భారీగా తరలిరావడం.. బాబు సభలకు ప్రజాదరణ లేకపోవడం స్పష్టంగా కనిపిస్తోందని, తమ పార్టీ విజయఢంకా మోగించడం ఖాయమనే అంశం దీని ద్వారా స్పష్టమవుతోందని చెప్పారు. జిల్లాలోని అన్ని అసెంబ్లీ.. పార్లమెంట్ స్థానాలను తమ పార్టీ కైవసం చేసుకోవడం ఖాయమని వివరించారు. రానున్న ఎన్నికలు ఏకపక్షమని, టీడీపీకి నామమాత్రంగా సీట్లు వస్తాయన్నారు. ఎమ్మెల్సీ, పార్టీ జిల్లా అధ్యక్షుడు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు మేకపాటి విక్రమ్‌రెడ్డి, నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ కల్యాణ చక్రవర్తి, డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డి, విజయనగరం జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు, పార్టీ నెల్లూరు సిటీ అభ్యర్థి ఖలీల్ అహ్మద్, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, రూరల్ నియోజకవర్గ పరిశీలకుడు మల్లు సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్యాకేజీలతో నేతలకు ఎర

ఓటమి తప్పదనే సంకేతాల తరుణంలో టీడీపీ నెల్లూరు లోక్‌సభ, కోవూరు అభ్యర్థులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంతిరెడ్డి దంపతులు అడ్డదారులు తొక్కుతున్నారు. కోవూరు నియోజకవర్గంపై ప్రధానంగా దృష్టి సారించిన వీరు నోట్లతో ఓట్ల కొనుగోలుకు సన్నద్ధమయ్యారు. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు నగదును ఎర వేసి ఈ వికృత పర్వానికి తెరలేపారు. మత్స్యకార గ్రామాల్లో దురాయి దురాచారాన్ని అడ్డుపెట్టుకొని ఓట్ల కొనుగోలుకు రూ.80 లక్షలతో బేరం పెట్టిన అంశం వెలుగులోకి రావడం.. ఈ వ్యవహారంపై అధికార యంత్రాంగం నిఘా ఉంచడంతో ప్రజాప్రతినిధులపై వీరు తాజాగా దృష్టి సారించారు.



తమవైపు తిప్పుకొనేందుకు వేమిరెడ్డి ఎత్తుగడ

- తన టీమ్‌ను రంగంలోకి దింపిన వైనం
- సర్పంచ్, ఎంపీటీసీలకు రూ.15 లక్షలు
- ఎంపీపీ, జెడ్పీటీసీలకు రూ.25 లక్షలు

కోవూరు: ఎన్నికల్లో విజయం సాధించడమే లక్ష్యంగా విలువల్లేని రాజకీయాలకు వేమిరెడ్డి దంపతులు శ్రీకారం చుట్టారు. ఓటమి భయంతో నేతలకు వీరు రేట్లు ఫిక్స్ చేసి తమ వైపునకు తిప్పుకొనే దుస్సాహసానికి తెరలేపారు. కోవూరు నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులను తమ శిబిరాలకు రహస్యంగా ఆహ్వానించి ఈ రకమైన మంతనాలకు శ్రీకారం చుట్టారు.

అధికార యంత్రాంగం నిఘా

స్వేచ్ఛాయుత పోలింగ్‌పై దృష్టి సారించిన ఎన్నికల కమిషన్ జిల్లా స్థాయిలో నిఘా ఉంచింది. మత్స్యకార గ్రామంలో దురాయి పేరిట ఓట్లు కొనుగోలు చేస్తున్న సమాచారం నిఘా వర్గాల ద్వారా అధికారులకు అందింది. దీనిపై ఓటర్లలో చైతన్యం తెచ్చేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు.

ప్యాకేజీలు ఖరారు..

ఆయా గ్రామాల్లో విజయం సాధించిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు రూ.15 లక్షలు.. ఎంపీపీలు, జెడ్పీటీసీలకు రూ.25 లక్షల చొప్పున ప్యాకేజీలను ఫిక్స్ చేశారని స్థానిక నేతలే పేర్కొంటున్నారు. ఓట్లు వేయించే బాధ్యత మీదేనంటూ వారికి ఈ మొత్తాలను ఎర వేస్తున్నారు. ఓటర్లకు సైతం భారీగానే ముట్టజెప్తామని, ఈ నగదు పంపిణీ బాధ్యతా మీదేనంటున్నారనే ప్రచారమూ జరుగుతోంది.

బంధుగణంతో టీమ్ ఏర్పాటు

ప్రజాప్రతినిధులతో పాటు ఆయా గ్రామాల్లో బలమైన నేతలకు సైతం ప్యాకేజీలు అందించేందుకు వేమిరెడ్డి తన బంధుగణంతో ఓ టీమ్‌ను ఏర్పాటు చేశారని తెలుస్తోంది. సదరు టీమే ఈ వ్యవహారాలను ముందుండి నడిపిస్తోంది. ప్యాకేజీ ఆశ చూపి కొందర్ని ఇప్పటికే తమ శిబిరంలో చేర్చుకున్నారు. తాజాగా స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులను తమ వైపు తిప్పుకొనేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. ఈ వ్యవహారాలపై ఓటర్లు భగ్గుమంటున్నారు. రానున్న ఎన్నికల్లో వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డికి ఓటేయాలని ప్యాకేజీ ఒప్పందం చేసుకుంటున్న ప్రజాప్రతినిధులు చెప్తుండటంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. గడిచిన ఐదేళ్లలో తమకు అండగా ఉండి.. సంక్షేమ పథకాలను అందించి ఆదుకున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కాకుండా మరెవరికీ ఓటేయబోమని వారు తెగేసి చెప్తున్నారు.

ఓటు నమోదుకు 14 వరకు అవకాశం

నెల్లూరు(దర్గామిట్ట): కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటు నమోదుకు ఈ నెల 14 వరకు అవకాశం ఉందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరినారాయణన్ పేర్కొన్నారు. కలెక్టరేట్లోని ఎస్సార్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఇప్పటి వరకు 20,44,815 మంది ఓటర్లుగా నమోదై ఉన్నారని.. ఫారం – 6 దరఖాస్తులు 7971 పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. ఓటరు జాబితాలో చిన్న తప్పులు, ఫొటోలు సక్రమంగా లేకపోయినా, ఎన్నికల సంఘం సూచించిన పది గుర్తింపు కార్డుల్లో దేన్నైనా చూపి ఓటు హక్కును వినియోగించుకోవచ్చని పేర్కొన్నారు.

'ప్రియదర్శిని'లో ఓట్ల లెక్కింపు కేంద్రం

జిల్లాలోని 8 అసెంబ్లీ, ఒక పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి నగరంలోని ప్రియదర్శిని ఇంజినీరింగ్ కళాశాలలో ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నామని వివరించారు. వ్యక్తిగత విమర్శలు, కుల మతాల ప్రస్తావన లేకుండా ప్రచారం చేసుకోవాలని సూచించారు. అన్ని రాజకీయ పార్టీలకు నామినేషన్ పత్రాలను అందజేశామని, వీటిని క్షుణ్ణంగా పరిశీలించి ఎలాంటి తప్పుల్లేకుండా పూర్తి చేయాలని కోరారు. భారీ ర్యాలీలు, సభలు, ప్రచారాలకు ముందుగానే సంబంధిత ఆర్వో వద్ద అనుమతి పొందాలని చెప్పారు.

ప్రచార వాహనాలకూ అనుమతులు తప్పనిసరి

ప్రచారంలో వినియోగించే వాహనాలకూ అనుమతులను పొందాలని చెప్పారు. సోషల్ మీడియాలో రాజకీయ పార్టీల అభ్యర్థుల ప్రకటనలకు ముందస్తు అనుమతి పొందాలని పేర్కొన్నారు. తమ పరిధిలో అన్ని అనుమతులను సకాలంలో మంజూరు చేస్తున్నామని వివరించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని పక్కాగా అమలు చేసి జిల్లా యంత్రాంగానికి సహకరించాలని కోరారు. డీఆర్వో లవన్న, సమాచార శాఖ డిప్యూటీ డైరెక్టర్ సదారావు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి మురళీధర్‌రెడ్డి, నారాయణ, టీడీపీ నుంచి సురేంద్రబాబు, బీజేపీ నుంచి శ్రీనివాస్, ఎన్నికల సెక్షన్ సూపరింటెండెంట్ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

నేటి నుంచి జేఈఈ మెయిన్స్

నెల్లూరు(అర్బన్): ఎన్ఐటీ, ఐఐటీలో ప్రవేశానికి సంబంధించిన జేఈఈ మెయిన్స్ పరీక్షలను గురువారం నుంచి ఈ నెల 8 వరకు నిర్వహించనున్నారు. పరీక్షలకు జిల్లావ్యాప్తంగా సుమారు ఎనిమిది వేల మందికిపైగా హాజరుకానున్నారు. పొట్టేపాళెంలోని అయాన్ డిజిటల్ సెంటర్, గూడూరులోని నారాయణ ఇంజినీరింగ్ కళాశాలలో పరీక్ష జరగనుంది.

న్యూస్‌రీల్

లింగ నిర్ధారణ నేరం



స్కానింగ్ కేంద్రంలో ఏడీఎంహెచ్‌ఓ తనిఖీ

నెల్లూరు(అర్బన్): స్కానింగ్ కేంద్రాల్లో లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమని ఏడీఎంహెచ్‌ఓ ఖాదర్‌వలీ పేర్కొన్నారు. దర్గామిట్టలోని కిమ్స్ ఆస్పత్రి, ఏఆర్సీ ఇంటర్నేషనల్ ఫర్టిలిటీ – రీసెర్చ్ సెంటర్‌లో గల స్కానింగ్ కేంద్రాలను వైద్యశాఖ అధికారులు బుధవారం తనిఖీ చేశారు. స్కానింగ్ తీయించుకుంటున్న వారి రిపోర్టులను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. లింగవివక్ష మంచిది కాదనే అంశాన్ని డాక్టర్లు తెలియజేయాలని కోరారు. డెమో అధికారి శ్రీనివాసరావు, డీపీసీ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలల్లో ప్రవేశానికి 21న పరీక్ష

నెల్లూరు(అర్బన్): జిల్లాలోని 11 ఆదర్శ పాఠశాలల్లో ఆరో తరగతిలో ప్రవేశానికి సంబంధించిన పరీక్షను ఈ నెల 21న నిర్వహించనున్నామని డీఈఓ రామారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐదో తరగతి స్థాయిలో తెలుగు, ఇంగ్లిష్ మీడియంలో పరీక్ష ఉంటుందని చెప్పారు. దరఖాస్తు గడువును ఈ నెల ఆరు వరకు పొడిగించారని తెలిపారు. అభ్యర్థులు పేమెంట్ గేట్ వే ద్వారా పరీక్ష రుసుమును చెల్లించాలని, ఆ తర్వాత వారికి ఒక సెంటర్‌ను కేటాయిస్తామని, దీని ఆధారంగా cse.ap.gov. in లేదా apcfss.inలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పరీక్ష ఫీజుగా ఓసీ, బీసీలు రూ.150.. ఎస్సీ, ఎస్టీలు రూ.75ను చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. వివరాలకు ఆదర్శ పాఠశాలల ప్రిన్సిపల్స్‌ను సంప్రదించాలని కోరారు.

మధ్యాహ్న భోజన అమలు తీరు పరిశీలన



కోవూరు: పట్టణంలోని పచ్చిపాల రామనాథమ్మ జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని జేసీ సేతు మాధవన్ బుధవారం పరిశీలించారు. భోజనాన్ని రుచి చూసిన అనంతరం ఆయన మాట్లాడారు. పరిశుభ్రమైన వాతావరణంలో పాఠశాలలోనే భోజనాన్ని తయారుచేసేలా ఏజెన్సీలు దృష్టి సారించాలని చెప్పారు. మెనూ బాగుందని, ఇదే తరహాలో అందించాలని సూచించారు. కోవూరు తహసీల్దార్ విజయశ్రీ, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రమణయ్య, సీనియర్ అసిస్టెంట్ కిరణ్, పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ దేవిక తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేతగా అవతారమెత్తిన ఉద్యోగి



ఆనం సమక్షంలో టీడీపీ కండువా కప్పుకొంటున్న నరేష్ చౌదరి

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: ఎన్నికల నియమావళిని ఉల్లంఘించి నెల్లూరు నగరపాలక సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగి రాజకీయ నేతగా అవతారమెత్తిన ఉదంతం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలు.. మర్రిపాడు మండలం పీ కండ్రికకు చెందిన నరేష్‌చౌదరి నెల్లూరు నగరపాలక సంస్థలోని ఇంజినీరింగ్ విభాగంలో విధులు నిర్వర్తిస్తున్నారు. టీడీపీ ఆత్మకూరు అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చుకొని ఏకంగా కండువా కప్పుకొన్నారు. ఈ ఫొటోలు, వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరలవుతున్నా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టకపోవడం గమనార్హం.

నా మిత్రుడు ఆదాలను ఆశీర్వదించండి

• సినీ దర్శకుడు తమ్మారెడ్డి భరద్వాజ



నెల్లూరు సిటీ: మంచి మనసు, సేవా గుణం కలిగిన తన మిత్రుడు ఆదాల ప్రభాకర్‌రెడ్డిని రూరల్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా భారీ మెజార్టీతో గెలిపించాలని సినీ నిర్మాత, దర్శకుడు తమ్మారెడ్డి భరద్వాజ కోరారు. ఈ మేరకు బుధవారం ఆయన వీడియోను విడుదల చేశారు. ఆదాల ఎమ్మెల్యేగా, మంత్రిగా, ఎంపీగా ప్రజలకు సేవ చేశారన్నారు. పేదల కోసం పనిచేసిన వ్యక్తి ఆదాల అని తెలిపారు. ఆయన నిత్యం ఏదో రకంగా సేవలు చేస్తుంటారని కొనియాడారు. సమాజం బాగుండాలని ఆశించే వ్యక్తిని గెలిపించడం అందరి బాధ్యతని తమ్మారెడ్డి పిలుపునిచ్చారు.

వ్యాధి నిర్ధారణలో ఎల్టీలదే కీలకపాత్ర



రికార్డులను అందజేస్తున్న డీఎంహెచ్‌ఓ

నెల్లూరు(అర్బన్): వ్యాధులను నిర్ధారించడంలో ల్యాబ్ టెక్నీషియన్లదే (ఎల్టీలు) కీలకపాత్ర అని అడిషనల్ డీఎంహెచ్‌ఓ ఖాదర్‌వలీ అన్నారు. సంతపేటలోని జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో బుధవారం ఎల్టీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఖాదర్‌వలీ మాట్లాడుతూ నిబంధనల ప్రకారమే రోగులకు పరీక్షలు చేయాలన్నారు. అలసత్వం ప్రదర్శించరాదన్నారు. ప్రతి పీహెచ్‌సీ, సీహెచ్‌సీలో రక్త పరీక్షల సంఖ్య పెరగాలన్నారు. మలేరియా జిల్లా అధికారి హుస్సేనమ్మ మాట్లాడుతూ డెంగీ, మలేరియా లాంటి కేసులు గుర్తించడంలో నిబంధనల ప్రకారం పక్కాగా పరీక్షలు చేయాలన్నారు.

• అనంతరం డీఎంహెచ్‌ఓ పెంచలయ్య తన కార్యాలయంలో ఎల్టీలకు పరీక్షల రికార్డులు అందజేశారు. కార్యక్రమంలో సహాయ మలేరియా అధికారి నాగార్జునరావు పాల్గొన్నారు.

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి	: రూ.70
సన్నవి	: రూ.55
పండ్లు	: రూ.22



సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి రైతు ద్రోహి



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో మంత్రి కాకాణి, చిత్రంలో పార్టీ నాయకులు

• రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

తోటపల్లిగూడూరు: సర్వేపల్లి తెలుగుదేశం అభ్యర్థి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి రైతు ద్రోహి అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి తెలిపారు. మండలంలోని వరిగొండ పంచాయతీకి చెందిన 25 టీడీపీ కుటుంబాలు బుధవారం వైఎస్సార్‌సీపీలో చేరాయి. నెల్లూరులోని కాకాణి నివాసంలో ఈ కార్యక్రమం జరిగింది. వారికి గోవర్ధన్‌రెడ్డి కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో దేవళాల మిట్టకు చెందిన కాములూరు సురేష్, వారి కుటుంబసభ్యులు, ఇతర కార్యకర్తలున్నారు. ఈ సందర్భంగా కాకాణి మాట్లాడుతూ సోమిరెడ్డి వ్యవసాయ శాఖ మంత్రిగా ఉన్నప్పుడు ధాన్యం వ్యాపారుల దగ్గర రూ.50 కోట్ల ముడుపులు తీసుకున్న విషయం అందరికీ తెలుసన్నారు. మిల్లర్ల దగ్గర డబ్బు తీసుకున్నట్లు ఆరోపించారు. రైతు రథం పంపిణీలో గోల్‌మాల్, నీరు – చెట్టులో అవినీతికి పాల్పడి రూ.కోట్లు సంపాదించారన్నారు. ఈసారి కూడా ఓడిపోవడం ఖాయమని సోమిరెడ్డికి అర్థమైందన్నారు. దీంతో గెలుపు విషయం పక్కనపెట్టి వసూళ్లపై దృష్టి సారించాడన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు ఉప్పల శంకరయ్యగౌడ్, నాయకులు గూడూరు విష్ణుమోహన్‌రెడ్డి, తాండ్ర జయరామయ్య తదితరులు పాల్గొన్నారు.

గెలిపించండి.. అభివృద్ధి చేసి చూపిస్తా..



ఆదాలకు స్వాగతం పలుకుతున్న మహిళలు

• వైఎస్సార్‌సీపీ నెల్లూరు రూరల్ అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు సిటీ: వచ్చే ఎన్నికల్లో తనను గెలిపిస్తే నెల్లూరు రూరల్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేసి చూపిస్తానని వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. రూరల్ నియోజకవర్గంలోని 30వ డివిజన్ చైతన్యపురిలో బుధవారం ఆదాల ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం నేతలు చేసే రౌడీయిజం కావాలో.. వైఎస్సార్‌సీపీ చేసే అభివృద్ధి కావాలో ప్రజలు తేల్చుకోవాల్సిన సమయం వచ్చిందన్నారు. రూరల్ అభివృద్ధిని ఆకాంక్షించే తనకు ఓటు వేయాలని, రౌడీయిజం లేకుండా పాలన చేసి చూపిస్తానన్నారు. తాను ఇన్‌చార్జిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత రూ.150 కోట్లతో పనులు చేయించానన్నారు. అవకాశం ఇస్తే మరిన్ని పనులు చేస్తామన్నారు. రాష్ట్రంలోనే రూరల్ నియోజకవర్గాన్ని మొదటి స్థానంలో నిలుపుతామన్నారు. కార్యక్రమంలో మేయర్ స్రవంతి, డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డి, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, నాయకులు మలిరెడ్డి కోటారెడ్డి, వైవీ రామిరెడ్డి, సన్నపురెడ్డి పెంచలరెడ్డి, కార్పొరేటర్‌లు, నాయకులు పాల్గొన్నారు.

నెల్లూరుకు నారాయణ చేసింది శూన్యం



ఎన్నికల ప్రచారం చేస్తున్న ఖలీల్ అహ్మద్, వైఎస్సార్‌సీపీ నాయకులు

• సిటీ అభ్యర్థి ఖలీల్ అహ్మద్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): 'గతంలో పొంగూరు నారాయణ మంత్రిగా ఉన్నప్పుడు నెల్లూరు నగరానికి చేసింది శూన్యం. 2019లో ఓడిపోయాక ఆయన ప్రజలను పట్టించుకోలేదు. ఎన్నికల సమయంలో వచ్చి రూ.వేల కోట్లతో అభివృద్ధి చేస్తానని చెప్పడం హాస్యాస్పదంగా ఉంది' అని వైఎస్సార్‌సీపీ సిటీ అభ్యర్థి ఖలీల్ అహ్మద్ అన్నారు. నగరంలోని 39వ డివిజన్ తిరిసిపేట, పాములమాన్యం తదితర ప్రాంతాల్లో బుధవారం ఖలీల్ అహ్మద్ ఎన్నికల ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు చేసిన కుతంత్రాలతో వృద్ధులు ఇంటి వద్దే పింఛన్లు అందుకోలేకపోతున్నట్లు చెప్పారు. వలంటీర్లు నేరుగా ఇంటికొచ్చి సంక్షేమ పథకాలు అందించాలంటే జగనన్నే మళ్లీ ముఖ్యమంత్రి కావాలన్నారు. నగర ఎమ్మెల్యేగా అనిల్‌కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో ఎన్నో అభివృద్ధి పనులు చేశారన్నారు. స్థానిక డివిజన్‌లో రూ.1.10 కోట్లతో పనులు జరిగాయన్నారు. మూలాపేట ఈఎస్‌ఆర్‌ఎం స్కూల్ గతంలో ఏ విధంగా ఉందో.. ప్రస్తుతం ఎలా ఉందో ప్రజలు చూడాలన్నారు. భూగర్భ డ్రెయినేజీ పేరుతో నెల్లూరును టీడీపీ అభ్యర్థి నారాయణ నాశనం చేశారన్నారు. వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ అభ్యర్థిగా విజయసాయిరెడ్డి రావడంతో నాయకులు, కార్యకర్తలు నూతనోత్సాహంతో పనిచేస్తున్నారన్నారు. ప్రత్యేక మేనిఫెస్టో తయారు చేసి అభివృద్ధి చేస్తామని ఆయన చెప్పడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో జంగమ కార్పొరేషన్ చైర్‌పర్సన్ వావిలేటి ప్రసన్న, నాయకులు మానికల సునీల్, నూనె ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో వ్యక్తి అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): భార్యను అదనపుకట్నం కోసం వేధించడమే కాకుండా ఆమెపై హత్యాయత్నం చేసిన ఘటనలో ఓ వ్యక్తిని నెల్లూరు వేదాయపాళెం పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. వారి కథనం మేరకు.. నెల్లూరు బీవీ నగర్‌లో చిన్నయ్య కుటుంబం నివాసం ఉంటోంది. ఆయన కుమార్తె సుహాసినికి ఆరు సంవత్సరాల క్రితం తోటపల్లిగూడూరు మండలం ఇస్కపల్లి గ్రామానికి చెందిన ఎం.సతీష్ బాబుతో వివాహమైంది. వారికి కృతిక్ అనే కుమారుడు ఉన్నాడు. సతీష్‌బాబు నెల్లూరు నగరంలోని కోటమిట్ట విద్యుత్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తూ భార్య, కుమారుడితో కలిసి ఎన్టీఆర్ నగర్‌లో నివాసం ఉంటున్నాడు. మద్యానికి బానిసైన అతను భార్యను వేధించడం ప్రారంభించాడు. అదనపుకట్నం తీసుకురావాలని, లేకపోతే మరో మహిళను వివాహం చేసుకుంటానంటూ బెదిరించసాగాడు. పెద్దలు సర్ది చెప్పే ప్రయత్నం చేసినా ప్రవర్తనలో మార్పురాలేదు. ఈ నేపథ్యంలో కుమార్తెను చూసేందుకు చిన్నయ్య గతనెల ఒకటో తేదీన ఎన్టీఆర్ నగర్‌కు వెళ్లాడు. దీంతో కోపోద్రిక్తుడైన సతీష్ బాబు భార్య, మామలతో గొడవపడి వారిని ఇంటి నుంచి గెంటేశాడు. దీంతో సుహాసిని తండ్రితో కలిసి పుట్టింటికి వచ్చింది. అదే నెల రెండో తేదీ సతీష్‌బాబు పూటుగా మద్యం తాగి భార్య ఇంటికి వెళ్లి ఆమెపై హత్యాయత్నం చేశాడు. చిన్నయ్య, స్థానికులు రావడంతో అక్కడి నుంచి పరారయ్యాడు. ఈ మేరకు బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. వారు కేసు నమోదు చేశారు. నిందితుడ్ని అరెస్ట్ చేసి బుధవారం కోర్టులో హాజరుపరిచినట్లు ఇన్‌స్పెక్టర్ పీవీ నారాయణ తెలిపారు.

సంక్షేమాన్ని ప్రజలకు వివరిస్తున్నాం



ఓటు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

ఆత్మకూరు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి, మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని కోరుతున్నట్లు ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి తెలిపారు. ఆత్మకూరు పట్టణంలోని 4వ వార్డు పరిధిలో బుధవారం విక్రమ్ రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి ఇంటికీ పథకాలు అందించారన్నారు. ప్రజలకు కరపత్రాలను అందజేస్తుంటే పథకాలతో ఆనందంగా ఉన్నామని చెబుతున్నారన్నారు. ఐదేళ్లపాటు అండగా నిలిచిన వలంటీర్ల సేవలు ప్రస్తుతం నిలిచిపోవడంతో పెన్షన్ లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఇందుకు ప్రతిపక్ష టీడీపీ కారణమన్నారు. అనేకమంది వలంటీర్లు స్వచ్ఛందంగా రాజీనామాలు చేసి ప్రజలకు సేవలు చేస్తామని పార్టీలో చేరేందుకు ముందుకొస్తున్నారని తెలిపారు. ప్రతిపక్ష నాయకులు వారి మనుషులకే కండువాలు కప్పి ఆనందపడుతున్నారని, వారి గురించి పెద్దగా పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ వెంకటరమణమ్మ, వైస్ చైర్మన్లు డాక్టర్ కేవీ శ్రావణ్‌కుమార్, షేక్ సర్దార్, జేసీఎస్ కన్వీనర్ డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య, ఎంపీపీ కేతా వేణుగోపాల్ రెడ్డి, కౌన్సిలర్ కౌసల్యమ్మ, మైనార్టీ ఇన్‌చార్జి షేక్ పర్వీన్, నాయకులు డాక్టర్ ప్రణీత్, ఐవీ రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పో.. పోవయ్యా

• కాకర్లతో సయోధ్యకు బొల్లినేని ససేమిరా
• ప్రజాగళం సభకు, ఆత్మీయ సమావేశాలకు డుమ్మా
• సురేష్ ఓటమే లక్ష్యంగా పావులు

ఉదయగిరి: నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీలో అసమ్మతి సెగలు ఇప్పట్లో చల్లారే సూచనలు కనిపించడం లేదు. కాకర్ల సురేష్‌కు చంద్రబాబు నాయుడు అవకాశం ఇవ్వడాన్ని బొల్లినేని వెంకట రామారావు వర్గం ఇంకా జీర్ణించుకోలేకపోతోంది. ఆయన ఆగ్రహాన్ని చల్లార్చేందుకు అధిష్టానం ఎన్ని ప్రయత్నాలు చేసిన ఫలించడం లేదు. రోజులు గడిచేకొద్దీ అంతా సర్దుకుంటుందని కేడర్ భావిస్తున్నా.. పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. చంద్రబాబు స్వయంగా వచ్చినా బొల్లినేని డుమ్మా కొట్టి తాను చెప్పింది చేసి చూపించే వ్యక్తినని అధినేతకే సంకేతాలు పంపారు. టీడీపీ ఆత్మీయ సమావేశాలు ఇటీవల రెండురోజులు జరిగాయి. వీటిని సురేష్ నిర్వహించారు. పార్లమెంట్ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కూడా హాజరయ్యారు. వీటికి రామారావును పిలిచినా రాలేదు.

సభకు రాకుండా..

వింజమూరులో ఇటీవల నిర్వహించిన ప్రజాగళం సభకు నియోజకవర్గ వ్యాప్తంగా కనీసం 15 వేల మందిని సమీకరించి చంద్రబాబు వద్ద మార్కులు కొట్టేయాలని సురేష్ భావించారు. దీనికి అవసరమైన వనరులు అందజేశారు. తీరా జనం లేక సభ వెలవెలబోయింది. స్వాక్షాత్తు బొల్లినేని సభకు రాలేదు. ఆయన వర్గీయులు తమకేం పట్టనట్లుగా ఉండిపోయారు. జనసమీకరణ గురించి పట్టించుకోలేదు. వ్యూహాత్మకంగా దెబ్బకొట్టే ప్రయత్నాలు చేశారని కాకర్ల వర్గీయులు ఆరోపిస్తున్నారు. చంద్రబాబు సాక్షిగా పార్టీలో విభేదాలు స్పష్టంగా కనిపించినా ఏమీ చేయలేకపోయారు. కాకర్లకు బొల్లినేని సహకరించకపోతే గెలుపు కష్టమేనని పలువురు సీనియర్లు బాబు దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. దీంతో రామారావు ఆరోజు రాత్రి బసలో అధినేతను కలిశారు. ఆయన కాకర్ల, బొల్లినేని మధ్య సయోధ్యకు ప్రయత్నాలు చేశారు. అయినా కొలిక్కిరాకపోవడంతో సురేష్‌కు 'యు ఆర్ ప్రొసీడ్' అని చెప్పినట్లు సమాచారం. చంద్రబాబు పర్యటనతో అంతా సర్దుకుంటుందని ఆశించిన కేడర్ ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలు చూసి డీలా పడిపోయింది.

ఎన్నికల్లో ఓడిస్తే..

భవిష్యత్‌లో జరిగే కార్యక్రమాలను బొల్లినేని వర్గీయులకు సంబంధం లేకుండా తాము మాత్రమే చేయాలని సురేష్ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. కాకర్లకు సీటు ఖరారు చేసిన నెలరోజుల తర్వాత బొల్లినేని నియోజకవర్గానికి వచ్చారు. చంద్రబాబు పర్యటన సందర్భంగా రెండు రోజులు కలిగిరి క్యాంపు కార్యాలయంలో తన ముఖ్య అనుచరులతో సమావేశాలు నిర్వహించారు. కేవలం బాబును మాత్రమే కలుస్తానని, కాకర్లకు సహకరించే ప్రసక్తి లేదని అనుచరులతో చెప్పినట్లు సమాచారం. కాకర్లను ఓడించి ఇంటికి పంపిస్తే భవిష్యత్‌లో అడ్డురాడని, తన వారసులకు అవకాశం ఉంటుందని ఆయన భావిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. రామారావు వర్గీయులు సహకరించకపోతే 'సైకిల్' కనీసం బరిలోకి రాకముందే పంక్చరవడం ఖాయమని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 147
లేయర్ (లైవ్)	: 78
బ్రాయిలర్ చికెన్	: 260
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 286
లేయర్ చికెన్	: 133



చెరువులో దిగి యువకుడి మృతి



కోటేశ్వర్ మృతదేహం

మనుబోలు: మండలంలోని వీరంపల్లి గ్రామంలో చెరువులో దిగి గల్లంతైన బొనిగి కోటేశ్వర్ (19) అనే యువకుడు మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. కోటేశ్వర్ డిగ్రీ చదువుతున్నాడు. ఖాళీ సమయంలో గేదెల్ని మేపేందుకు పొలానికి తీసుకెళ్తుంటాడు. ఈక్రమంలో మంగళవారం సాయంత్రం చెరువులో దిగిన గేదెలను గట్టుపైకి తోలేందుకు యత్నించాడు. అయితే అతడికి ఈత రాక మునిగిపోయాడు. సమాచారం అందుకున్న ఎస్సై అజయకుమార్ ఈతగాళ్లతో గాలింపు జరిపించారు. బుధవారం కోటేశ్వర్ మృతదేహం చెరువులో తేలియాడింది. దీంతో తల్లిదండ్రులు, బంధువులు కన్నీరుమున్నీరయ్యారు.

చేపల వేటకు వెళ్లి..

అల్లూరు: చేపల వేటకు వెళ్లి ఓ యువకుడు మృతిచెందిన ఘటన మండలంలోని సింగపేట గ్రామంలో జరిగింది. ఎస్సై పి.శ్రీనివాసులురెడ్డి కథనం మేరకు.. సింగపేట ఎస్టీ కాలనీకి చెందిన గంధాల పోలయ్య (24), నరసింహ అనే ఇద్దరు బుధవారం చెరువు తూము వద్ద చేపల వేటకు వెళ్లారు. పోలయ్య తూము లోపలికి వెళ్లి ఎంతకూ బయటకు రాకపోవడంతో నరసింహ ఆందోళన చెంది సమీపంలోని వారికి సమాచారం అందించాడు. వారు వచ్చి తూములో దిగి చూడగా అప్పటికే పోలయ్య మృతిచెంది ఉన్నాడు. అతనికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలియజేశారు.



పోలయ్య మృతదేహం

విద్యుదాఘాతంతో ఆటో దగ్ధం



ఘటనా స్థలంలో ఆటో

వెంకటాచలం: విద్యుదాఘాతంతో టాటా మ్యాజిక్ ఆటో దగ్ధమైన ఘటన మండలంలోని గొలగమూడి క్రాస్‌రోడ్డు సమీపంలో బుధవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. నెల్లూరు వైపు నుంచి వెంకటాచలం వైపు వెళ్తున్న ఆటో గొలగమూడి క్రాస్‌రోడ్డు సమీపానికి చేరుకోగానే విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. వెంటనే డ్రైవర్ మనోహర్ వాహనాన్ని రోడ్డు పక్కన నిలిపివేశారు. అతను, ప్రయాణికులు దూరంగా పరుగులు తీశారు. మంటలు పెద్దవి కావడంతో ఆటో కాలిపోయింది. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వగా ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.